



పి.గన్నవరంలో చిల్డ్రన్స్‌డే వేడుకలు

ఘనంగా బాలల దినోత్సవం

వార్తలు..8లో

అమ్మో..కూరగాయల ధరలు

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):





- కూరగాయల ధరలపై కార్తీకమాసం ఎఫెక్ట్
- అమాంతం పెరిగిన రేట్లు
- ఏ రకమైనా రూ.50 పైనే
- సామాన్యులు లబోదిబో

ధరలు ఇలా..

వంకాయ మార్కెట్లో రూ.80 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. క్యాప్సికం కేజీ రూ.100, ఉల్లిపాయల ధర రూ.70కు విక్రయించడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిక్కుడుకాయలు రూ.90, బీన్స్ రూ.50, క్యారెట్ రూ.80, మునగ రూ.70, బెండకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయలు రూ.60, ఆగాకరకాయలు రూ.110, అలసంద రూ.70, బీరకాయ రూ.60లు, టమాట రూ.32, ఆకుకూరలు కట్ట రూ.20లు పైబడి ఉన్నాయి.

అల్లం ధర ఆకాశాన్నంటింది, వంకాయ వణుకు పుట్టిస్తోంది.. చిక్కుడుకాయ, కాకరకాయ ధరలు అమాంతం పెరిగాయి. క్యాబేజీ, క్యారెట్, దోసకాయ, ఆనపకాయ రేట్లు కలవరపెడుతున్నాయి. ఉల్లిపాయ కొందామంటేనే కన్నీరు వస్తోంది. ఇలా సామాన్యుడు కూరగాయలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాడు. కార్తీకమాసంలో కూరగాయలు కొనాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. ఏది కొందామన్న సామాన్యుడు వణికిపోతున్నాడు. బహిరంగ మార్కెట్‌లో ఏ కూరగాయ ధర చూసిన కేజీ రూ.50పైమాటే. గతంలో కురిసిన భారీ వర్షాలతో కూరగాయల పంట దెబ్బతింది. దీంతో దిగుబడి తగ్గి కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి, పలు రకాల కూరగాయలు అవసరమైన స్థాయిలో సరఫరా కావడం లేదని వ్యాపారులు అంటున్నారు. కార్తీకమాసం ముగిసే వరకు కూరగాయల ధరలు దిగిరావని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నెల రోజుల అత్యధికంగా కూరగాయల వినియోగం ఉంటుంది. అయ్యప్పదీక్షలు, భవానీ దీక్షలు, అన్నసమారాధనాలు ఉన్న నేపథ్యంలో ధరలు కొనసాగే పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలి

డీఈవో షేక్ సలీంబాషా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను విధిగా అమలు చేయడం ద్వారా నూరుశాతం సత్ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. వన్నెచింతలపూడి (సమనస) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల కోసం అధునాతన భోజనశాల నిర్మించిన జలధాని కాశీవిశ్వేశ్వరరావు, స్థలదాతలు రామకృష్ణవర్మ సోదరులు అప్పటి విద్యాకమిటీ ప్రతినిధులను డీఈవో ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సమకూర్చిన ఆయుర్వేదం మొక్కలను ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశంతో కలిసి పాఠశాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, డీఎస్వో జి.సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగసత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్కడ పనులు అక్కడే

అందుబాటులో లేని ఇసుక.. ఆరంభం కాని పనులు



కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో తెరుచుకోని ఇసుక ర్యాంపు

జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇసుక ర్యాంపులు తెరుచుకోకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఉపాధి హామీ పథకం నిధులతో మొదలుపెట్టిన సీసీ రోడ్ల పనులు ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. పల్లె పండుగ పేరుతో పండుగ వాతావరణంలో ప్రారంభించిన రహదారుల పనులన్నీ ఇసుక కొరతతో నిలిచిపోయాయి. మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు..

మండపేట, (ఆంధ్రజ్యోతి):

- ఇంకా తెరుచుకోని ఇసుక ర్యాంపులు
- జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత
- నిలిచిపోయిన అభివృద్ధి పనులు

జిల్లాలో ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి పల్లె పండుగ పేరిట అక్టోబరు 14న సీసీరోడ్లు, గ్రావెల్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కానీ ఇప్పటివరకు సీసీ రోడ్ల పనులు ప్రారంభం కాలేదు. జిల్లాలో ఉన్న 7 నియోజకవర్గాలు, 22 మండలాల పరిధిలో ఉన్న 385 పంచాయతీల్లో 737 రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పనులకు నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ఇక్కడ రోడ్డు పనులు చేసేందుకు ఇసుక లభ్యత లేకపోవటంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో అధికారులు పనులు ఎపుడు ప్రారంభించాలి, ఎప్పుడు పూర్తి చేయాలనేదానిపై మల్లగుల్లాలు పడుతున్నారు.



పల్లె పండుగ పేరుతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ (ఫైల్)

జిల్లాలో ఇంకా ఇసుక టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతోనే ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయని తెలుస్తోంది. గోదావరిలో పుష్కలంగా ఇసుక ఉన్నప్పటికీ టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. మరో ప్రక్రియ పూర్తయినా తక్షణమే ఇసుక అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఇసుక ర్యాంపుల్లో పనులు చేపట్టి బాట

టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే..

పనులు పూర్తి చేయాలంటే కనీసం వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజులు ఇసుక లభ్యమయ్యే పరిస్థితి జిల్లాలో లేదు. కోనసీమ జిల్లాలో 12 ఇసుక ర్యాంపులకు టెండర్లు పిలిచారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఇసుక ర్యాంపులకు సంబంధించి టెక్నికల్ కమిటీని నియమించారు. కోనసీమ జిల్లాకు సంబంధించి మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో గ్రామాలు గోదావరి చెంతనే ఉన్నప్పటికీ గుప్పెడు ఇసుక ఇప్పటివరకు దొరకని పరిస్థితి ఉంది. ఇక ప్రభుత్వ పనులకు సంబంధించిన అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలు. గృహ నిర్మాణాలు, సీసీ రోడ్ల నిర్మాణం పనులు నిలిచిపోయాయి. బయట ఇసుక ధరను బ్లాక్ మార్కెట్‌లో భారీగా పెంచేశారు. దీంతో ఇసుక కొరత నేపథ్యంలో ఎక్కడా పనులు ప్రారంభమైన దాఖలాలు లేవు. ఇసుక ర్యాంపుల టెండర్ల ప్రక్రియ పూర్తయితే సీసీ రోడ్డు పనులు ప్రారంభమై సకాలంలో పల్లె పండుగలో మొదలుపెట్టిన రోడ్లు పరుగులు పెడతాయి. అలాగే మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులతో పాటు పంచాయతీరాజ్, జిల్లాపరిషత్, ఇతర శాఖల అధ్వర్యంలో చేపట్టే పనులు కూడా వేగం పుంజుకుంటాయి. ఇప్పటికే ర్యాంపులకు బిడ్‌ల దాఖలు ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే సంబంధిత టెండర్లను ఖరారు చేసి అన్ని ర్యాంపులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



వేదాశీర్వచనం పొందుతున్న ఐఏఎస్‌లు

అంతర్వేదిలో ట్రైనీ ఐఏఎస్‌లు

అంతర్వేది, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వివిధ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మంది ట్రైనీ ఐఏఎస్‌లు గురువారం స్వామివారి ఆలయానికి విచ్చేశారు. తొలుత వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న అనంతరం వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. అనంతరం ఆలయ విశిష్టత, చరిత్రలను అర్చకులు వారికి వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ సత్యనారాయణ తహశీల్దార్ ఎఫ్ఏసీ సీహెచ్ బాస్కర్, ఆర్ఐ పి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామి వారి దర్శనానంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి ఒకరోజు ఆదాయం రూ. 1,93,544 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఓం నమో.. శివ రుద్రాయ

ఉమ్మడి జిల్లాలో దర్శనీయ క్షేత్రాలు

6లో

రేపటి నుంచి ఇసుక తవ్వకాలు

జిల్లాలోని 12 రీచ్‌లలో ప్రారంభం : కలెక్టర్ మహేష్‌కుమార్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పన్నెండు ఇసుక రీచ్‌లలో ఈ నెల 16 నుంచి ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం గనులు, భూగర్భశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా, అసైన్డ్ భూముల్లో ఇసుక మేటలు తొలగింపు కోసం ముందుగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో జలవనరులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి నివేదికలు స్వీకరిస్తామన్నారు. సంబంధిత నివేదికలను జిల్లాస్థాయి ఇసుక కమిటీకి పంపి అనుమతులు పొందాల్సి ఉందన్నారు. రైతుల లిఖిత పూర్వక అంగీకారంతో మూడు కేటగిరీల్లో తవ్వకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందు కోసం రామచంద్రపురం డివిజన్‌లో ఐదు దరఖాస్తులు రాగా రెండింటికి తనిఖీ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. కొత్తపేట డివిజన్‌లో ఏడు దరఖాస్తులు రాగా రెండింటి సర్వే పూర్తి అయిందన్నారు. త్వరలో జరిగే జిల్లా కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత ఇసుక తవ్వకాలు చేపడతారన్నారు. రోజువారీగా ఎంత పరిమాణంలో ఇసుక తీసి విక్రయిస్తున్నారో నివేదికలు అందించాలన్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్‌లకు సంబంధించి త్వరలో పర్యావరణ అనుమతులు రానున్నాయని స్పష్టం చేశారు. తవ్వకాల కోసం నిర్దేశించిన షరతులకు అనుగుణంగా ఎంపిక చేసిన ఏజెన్సీలకు మాత్రమే ఇసుక తీసే వెసులుబాటు ఉందన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక తవ్వకాలు ఆయా ఏజెన్సీలు నిర్వహిస్తాయన్నారు. సీసీ టీవీ మోనటరింగ్ సిస్టంతో పాటు రవాణా పర్యవేక్షణకు పోలీసు కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానిస్తూ సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డీఎల్ఎస్సీ నిర్ణయించిన ధరల ప్రకారం రశీదులు అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా గనులు భూగర్భశాఖ అధికారి ఎల్.వంశీధర్‌రెడ్డి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, గోదావరి హెడ్‌వర్క్స్ కాశీవిశ్వేశ్వరరావు, ఆర్టీవో డి.శ్రీనివాసరావు, రియాల్టీ ఇనస్పెక్టర్ టి.సుజాత, జీఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు సత్యదేవుని గిరి ప్రదక్షిణ

మెయిన్‌లో..

మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా..

భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి.. జాయింట్ కలెక్టర్ నిషాంతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలను గుర్తించి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగానే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. మాన్యువల్‌గా భవన నిర్మాణ ప్లాన్లు ఇవ్వరాదన్నారు. ఆన్‌లైన్‌లో మాత్రమే ప్లాన్‌లు అప్రూవల్ చేయాలని సూచించారు. ఈదరపల్లిలోని సామాజిక భవనంలో గురువారం అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేసీ నిషాంతి మాట్లాడుతూ గ్రామాల్లో అనధికార లేఅవుట్‌లు, అనధికారికంగా ఎవరు భవనాలు నిర్మించినా తక్షణం నోటీసులు జారీచేసి తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా), పంచాయతీలు ఇచ్చిన అనుమతులకు వ్యతిరేకంగా ఎక్కడైనా భవన నిర్మాణాలు జరిపితే తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. అనధికారిక లేఅవుట్‌లు, భవన నిర్మాణాలపై నోటీసులు జారీ చేయని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన నిర్మాణ అనుమతులను పంచాయతీ సమావేశాల్లో ఆమోదించాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో 300 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం కలిగిన స్థలాల్లో వ్యక్తిగత నివాస యోగ్య భవన నిర్మాణ అనుమతులను నిబంధనల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఇవ్వవచ్చునన్నారు. 300 చదరపు మీటర్లు పైబడి ఉన్న స్థలాల్లో భవన నిర్మాణాలకు అముడా అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని ఆమె సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి మాట్లాడుతూ కార్యదర్శులు నిబంధనలు పాటించకపోవడం వల్లే పలు చోట్ల కేసులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన రూల్స్‌ను అమలు చేయాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. అనంతరం కార్యదర్శులకు డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ ఎ.సత్యమూర్తి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అముడా ఏపీవో పి.ఉమామహేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వీఎస్ చిట్టిబాబు, మలిశెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, రెడ్డి శిరీష, పర్తంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాకు చర్యలు

అమలాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 2024-25 రబీ సీజన్‌లో గోదావరి సెంట్రల్ డెల్టా, తూర్పు డెల్టాలో ఉన్న మొత్తం 2,71,658 ఎకరాలకు పూర్తి స్థాయిలో సాగునీటిని సరఫరా చేసేందుకు జిల్లాస్థాయి సలహా సంఘ సమావేశం నిర్ణయించిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా నీటి పారుదల సలహా సంఘం సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పసలీ-1434 పంట మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు గోదావరి నదిలో పుష్కలంగా సాగునీటి నిల్వలు ఉన్నాయని జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌లో తక్కువ కాలపరిమితి కలిగిన వంగడాల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సాగునీటి కేటాయింపులు సక్రమంగా జరుపుతూ జిల్లాకు రావాల్సిన నీటిని సమృద్ధిగా వినియోగించాలన్నారు. శివారు ప్రాంత రైతులకు సైతం సాగునీరు అందించాలని, ఏ ఒక్క ఎకరానికి సాగునీటి కొరత సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వల చిట్టచివరి ఆయకట్టుకు సాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితుల్లో డ్రెయిన్లలో అరు క్రాస్ బండ్‌లు వేయడానికి ప్రతిపాదించామన్నారు. సాగునీటి సమస్యలను అధిగమించేందుకు ఫిబ్రవరి నుంచి వారాబందీ విధానాన్ని అమలు చేయాలన్నారు. రబీ సీజన్‌లో అత్యవసరంగా చేపట్టాల్సిన 114 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. కాల్వల మూసివేత సమయంలో చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డ్రైనేజీ విభాగం డీఈ ఎంవీఎస్ కిశోర్, జలవనరులశాఖ డీఈ నాగేంద్రకుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మన రాష్ట్రంలో దర్శనీయ ప్రాంతాలుగా ఉన్న పంచారామ క్షేత్రాల గురించి శ్రీనాథుడు రచించిన భీమేశ్వర పురాణంలో ఉన్నట్లు పండితులు చెపుతున్నారు. క్షీరసాగర మథనం సమయంలో వెలువడిన అమృతాన్ని మహావిష్ణువు మోహిని రూపం ధరించి సురాసురులకు పంచుతుండగా తమకు అన్యాయం జరిగిందంటూ రాక్షసులు అసంతృప్తి చెందారు. వారు శివుడి కోసం తీవ్ర తపస్సు చేస్తారు. తారకాసురుడు అనే రాక్షసుడు మహా తపస్సు చేసి తనకు స్త్రీ గర్భం నుంచి పుట్టిన ఎవరి వల్లా మరణం రాకూడదని పరమశివుని వరం పొందుతాడు. శివుడు తన ఆత్మలింగాన్ని ప్రసాదించి వరం అనుగ్రహిస్తాడు. తారకాసురుడు ఆ వర గర్వంతో దేవతలను హింసించడంతో వారంతా మహాదేవుని వేడుకుంటారు. స్త్రీగర్భం నుంచి పుట్టని వారు ఎవరా ఆలోచింపగా కుమారస్వామిని గుర్తించి పరమశివుని ఆదేశానుసారం దేవతల సైన్యానికి అధిపతిగా నియమిస్తారు. కుమారస్వామి తారకాసురుడితో భీకరయుద్ధం చేసి తన పాశుపతంతో వధిస్తాడు. తారకాసురుని మెడలో ఆత్మలింగం ఐదు ఖండాలుగా అవుతుంది. ఈ ఐదు ఖండములు ఐదు క్షేత్రాలలో ప్రతిష్ఠించబడ్డాయి. అందులో ఒకటి అమరావతిలో ఇంద్రుడు ప్రతిష్ఠించగా, రెండో శకలం చంద్రునితో భీమవరంలో, మూడో శకలం శ్రీరామచంద్రుడు పాలకొల్లులో, నాల్గో శకలం కుమారస్వామి సామర్లకోటలో ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఐదో శకలం ద్రాక్షారామంలో ప్రతిష్ఠించేందుకు సప్త మహా రుషులు సంకల్పించగా అనుకున్న ముహూర్తానికి కాలయాపన జరగడంతో భీమేశ్వరుడు స్వయంభువుగా వెలసినట్లు పురాణాలు చెప్తున్నాయి. అవే పంచారామ క్షేత్రాలుగా విలసిల్లుతున్నాయి. నేడు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ పంచారామ క్షేత్రాలు.. వాటి విశిష్టతపై ప్రత్యేక కథనం..

సామర్లకోట/ద్రాక్షారామ

ఓం నమో.. శివ రుద్రాయ..



» కార్తీకమాసంలో దర్శనీయ క్షేత్రాలుగా పంచారామాలు » ఐదు ఆలయాలకు ఎంతో విశిష్టత » నేడు కార్తీక పౌర్ణమి

వర్ణాలు మారే గునుపూడి సోమేశ్వరుడు

చరిత్ర ప్రసిద్ధికెక్కిన అతి ప్రాచీన దేవాలయాల్లో గునుపూడి శ్రీసోమేశ్వర జనార్థనస్వామి దేవాలయం ఒకటి. తూర్పు చాళుక్య రాజుల్లో ప్రసిద్ధుడైన చాళుక్యభీముడు ఈ దేవాలయాన్ని మూడో శతాబ్ధంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. స్థలం పురాణంలో ఈ క్షేత్రాన్ని పరమ పవిత్రక్షేత్రంగా వర్ణించారు. ఈ దేవాలయం గురించి భీమఖండం, బ్రహ్మాండ పురాణంలోను పేర్కొన్నారు. చంద్రుడే స్వయంగా ప్రతిష్ఠించడం వల్ల ఇక్కడి శివలింగం అమావాస్య రోజున గోధుమవర్ణంలోను, పౌర్ణమినాడు శ్వేతవర్ణంలో కనిపిస్తుంది. శివలింగ పైభాగమున అన్నపూర్ణ అమ్మవారి విగ్రహం ఉండడం మరో ప్రత్యేకత. ఈశ్వరుడు గంగను శిరస్సుపై ధరించడానికి ప్రతీకగా ఈ విధంగా నిర్మితమైనదని ప్రజల నమ్మకం. ఈ దేవాలయానికి జనార్థనస్వామి క్షేత్రపాలకుడు అవడంతో ఇక్కడ వివాహం చేసుకుంటే వైవాహిక జీవితం ఎంతో శుభమయంగా సాగుతుందని నమ్మకం.



యోగ లింగం.. కుమారరామం



సామర్లకోటలోని కుమార రామ భీమేశ్వరాలయం రాష్ట్రంలో ఏకైక యోగలింగంగా, జప, తప, యోగ సాధన చేసే వారికి ప్రశాంతమైన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. చాణక్య వంశానికి చెందిన భీమమహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి, ద్రాక్షరామ భీమేశ్వరాలయం ఈ రెండు ప్రాకారాలు వాస్తురీత్యా ఒకే ఆకారం కలిగి ఉంటాయి. నాలుగు దిక్కుల్లో నాలుగు గోపుర ద్వారాలు, లోపలి ప్రాకారం సమతలంగాను రెండు భాగాలు చేశారు. గుడి చుట్టూ రెండంతస్తులు మండపం ఉంది. ఈ మండపం ఎక్కేందుకు తూర్పుభాగాన మెట్లు, లోపలి మండపం నుంచి కిందికి దిగేందుకు దక్షిణం వైపున విఘ్నేశ్వరుని ఆలయం, సూర్యుని గుడి, తూర్పు వైపున గిరిజా సుందరి ఆలయం ఉన్నవి. లోపలి ప్రాకారం మధ్యలో ఉన్న భీమేశ్వరుని ఆలయం చతురస్రాకారంగా ఉండి రెండు అంతస్తులు కలిగి ఉన్నది. కింది అంతస్తులో ప్రతిష్ఠించిన లింగం పైఅంతస్తు కప్పు గుండాపోయి రెండో అంతస్తులోకి ప్రవేశించి రుద్రభాగం పూజింపబడుతోంది.





ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం ద్రాక్షారామం..



పంచారామాలలో ప్రసిద్ధి గాంచిన ఆరామంగా, త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా, ద్వాదశ జ్యోతిర్లాంగాలలో ప్రముఖ క్షేత్రంగా విరాజిల్లుతున్న ప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామం. ఈ క్షేత్రంలో స్వయంభువుడుగా భీమేశ్వర స్వామి, అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తిపీఠంగా మాణిక్యాంబ అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. ద్రాక్షారామ క్షేత్ర మహాత్యం గురించి వ్యాసుడు తన భీమఖండంలో దక్షారామత్పరం నభూతో నభవిష్యతిగా స్తుతించాడు. కవి సార్వభౌముడు శ్రీనాధుడు ద్రాక్షారామ వంటి క్షేత్రం, భీమేశ్వరుని వంటి దైవం, సప్తగోదావరి వంటి తీర్థరాజం ఇలలోలేదని పేర్కొన్నాడు. భీమేశ్వరుని ఆలయం క్రీశ 892-922 కాలంలో నిర్మాణం ప్రారంభించినట్లు ఆలయంలో ఉన్న శిలాశాసనాల ద్వారా తెలుస్తున్నది. చాళుక్యరాజు మొదటి భీమునికాలంలో నిర్మాణం జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. కార్తీకమాసంలో సప్తగోదావరిలో పుణ్యస్నానమాచరించి భీమేశ్వరుని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. భీమేశ్వరునికి సూర్యభగవానుడు తొలి అర్చన చేసినట్లు చెబుతారు.

దేవేంద్రుడు ప్రతిష్ఠించిన అమరేశ్వరస్వామి





అమరావతిలో శివలింగాన్ని దేవతల రాజైన ఇంద్రుడు ప్రతిష్ఠించాడని స్థలపురాణం. తారకాసురుని మెడలోని కుమారస్వామి ఛేదించిన ఆత్మలింగం ఐదు ముక్కలుగా పగిలి ఐదు క్షేత్రాలలో పడింది. అందులో అమరావతిలో పడిన భాగాన్ని దేవతలకు అధి పతి అయిన దేవేంద్రుడు ప్రతిష్ఠించినట్టు స్థల పురాణంలో ఉంది. ఇక్కడ శివలింగం అత్యంత ఎత్తుగా ఉండడంతో అర్చకులు పీఠం ఎక్కి అభిషేకాలు చేస్తుంటారు. ఎత్తు పెరగకుండా ఉండేందుకు బృహస్పతి ఆదేశాల మేరకు మేకు కొట్టడంతో శివలింగం పైభాగంలో రక్తం మరక ఏర్పడినట్టుగా చెబుతారు. ఇప్పటికీ ఆ మరక కనిపిస్తుంది. ఈ శివలింగాన్ని శ్రీరామ చంద్రుడు పూజించాడని చెప్తారు. అమరుల నివాసంగా మారిన ప్రాంతంగా అమరావతి అనే పేరు వచ్చిందని పురణాకథనం. బాలచాముండికా సమేతుడైన అమరేశ్వరస్వామి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు.

దర్శనీయ క్షేత్రాలు

కార్తీకమాసంలో జిల్లాలో పలు ఆలయాలు భక్తులతో కళకళలాడతాయి. వీటిలో ముఖ్యమైనవి.

● అన్నవరం సత్యదేవుడి పుణ్యక్షేత్రం



రత్నగిరి కొండపై హరిహరహిరణ్యగర్భ త్రిమూర్త్యాత్మక స్వరూపుడిగా అనంతలక్ష్మీ సత్యదేవితో కలిసి శ్రీ సత్యదేవుడు వెలిశాడు. కరనామ సంవత్సర శ్రావణ శుద్ధ విధియనాడు స్వామి అన్నవరం గ్రామంలో పంపానది తీరాన రత్నగిరిపై అంకుడి చెట్టుకింద దర్శనమిస్తారని చెబుతారు. 125ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం ఖరనామ సంవత్సర శ్రావణ శుద్ధ విధియ 1891, ఆగస్టు 6న నిర్మించారు.

● అంతర్వేది లక్ష్మీనరసింహుడి ఆలయం

దక్షిణ భారతదేశాన్ని పాలించిన పల్లవరాజులు క్రీస్తుశకం 5వ శతాబ్ధంలో అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించారు. నౌక వ్యాపారి కొప్పనాతి ఆదినారాయణ దీన్ని పునర్నిర్మించారు.

● అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరుడు

గౌతమీ గోదావరి నదీతీరాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో శ్రీ విఘ్నేశ్వరుడు దక్షిణాభిముఖుడై ఉన్నాడు.ఆలయం లో దక్షిణ సింహద్వారం గుండా శ్రీవిఘ్నేశ్వరుడిని, తూర్పు సింహద్వారంనుంచి క్షేత్ర ప్రభువును దర్శించవచ్చు.

● పిఠాపురం పాదగయ...


ఒకప్పుడు పీఠికాపురం.. పిఠాపురంగా ప్రసిద్ధి చెందింది. శివకేశవ పుణ్యక్షేత్రంగా భక్తులుదర్శించుకుంటున్నారు. దేశంలోని త్రిగయాలలో ఒకటిగా పిఠాపురం పాదగయ క్షేత్రంగా విరాజిల్లుతోంది.

● చినవెంకన్నగా ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల వేంకటేశ్వరుడు భక్తులకు కొంగు బంగారమై వెలసిల్లాడు. శని, ఆదివారాల్లో రద్దీగా ఉంటుంది.

విష్ణుమూర్తి ప్రతిష్ఠించిన క్షీరారాముడు..



క్షీరపురి (పాలకొల్లు)లో పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి కొలువుతీరి ఉన్నారు. స్కాంధ పురాణ ఆధారంగా ఆలయ చరిత్ర గురించి తెలుస్తోంది. తారకాసురుడిని వధించడానికి శివుని కుమారుడు కుమారస్వామి భీకర యుద్ధం చేసి తారాకాసురుడి దేహంలో ఉన్న అమృతలింగం ఖండించాడు. అందులో శిరోభాగం క్షీరపురి క్షేత్రంలో పడడంతో శ్రీమహావిష్ణువు ఆ ఖండభాగాన్ని ప్రతిష్ఠించినట్టు తెలుస్తోంది. 918 ప్రాంతంలో మొదటి చాణిక్య భీముడు ఇక్కడ ఆలయనిర్మాణం చేపట్టినట్టు చరిత్ర ఆధారంగా తెలుస్తోంది. అనంతరం శాతవాహనులు, ఇక్ష్వాకులు, తూర్పు చాణుక్యుల పాలనలో ఆలయం అభివృద్ధి చెందింది. దీంతోపాటు 120 అడుగుల ఎత్తున 9 అంతస్తుల్లో గాలిగోపురం నిర్మించి పైభాగంలో శిఖరాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో పంచగణపతులు, శివ పంచాయతన దేవాలయం, పంచ లింగాలు, పంచదేవేర్లు, పంచ మండపాలు, పంచ ద్వారాలు, పంచ నందులు, పంచ శిఖరాలు ఉండడం విశేషం. ఇక్కడి శివలింగం తెల్లని పాల రంగులో ఉంటుంది. క్షీరారామంలో ఓరోజు బస చేస్తే ఒక ఏడాది ఉన్నట్లేనని నమ్మకం.



ఒకే రోజులో పంచారామాల యాత్ర

» ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
» ఐదు క్షేత్రాలు సందర్శించేలా రూట్
» వారాంతాల్లో వెళ్లి రావొచ్చు



అమలాపురంలో పంచారామ క్షేత్రాల దర్శనం కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు

కాకినాడ నుంచి ఇలా...

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 14: కార్తీక మాసంలో ప్రత్యేక దర్శనాల కోసం ఆర్టీసీ పంచారామల టూర్ ప్యాకేజీని రూపొందించింది. ఒకేరోజులో ఈ ఐదు ఆలయాలను వెళ్లి వచ్చేలా ఆర్టీసీ స్పెషల్ ప్యాకేజీని అందుబాటులో ఉంచింది. కాకినాడ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుంది. ముందుగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, చివరిగా సామర్లకోట దర్శనం జరుగుతుంది. అనంతరం ప్రయాణికులతో బస్సు మరుసటిరోజు రాత్రికి కాకినాడ డిపోకు చేరుతుంది. కార్తీకమాసంలో ప్రతి శని, ఆదివారాల్లో అనగా నవంబరు 16, 17, 23, 24, 30, డిసెంబరు 1 తేదీల్లో బస్సు పంచారామ క్షేత్రాలకు బస్సు రాత్రి 8 గంటలకు బయలు దేరుతుంది. కాకినాడనుంచి పంచారామ టూర్ టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ రూ.910, అల్ట్రా డీలక్స్‌కు రూ.1120, సూపర్ లగ్జరీకి రూ.1160గా ఉన్నాయి.

పర్యటన ఇలా..

కాకినాడనుంచి నేరుగా పంచారామాల్లో ఒకటమైన అమరావతికి ముందు వెళ్తారు. అక్కడి అమరలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుని అక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి వెళ్తారు. అక్కడ సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం పాలకొల్లు బయలుదేరి వెళ్లి అక్కడి క్షీరరామ లింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు. తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామానికి బయలుదేరతారు. అక్కడ భీమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అక్కడి నుంచి చివరిగా కాకినాడ జిల్లా సామర్లకోటలోని కుమారభీమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత బస్సు కాకినాడ డిపోకి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్యాకేజీలో భాగంగా కేవలం బస్సు ప్రయాణం మాత్రమే ఉంటుంది. ఆహారం, అక్కడి ఎంట్రీ టికెట్లు వంటివి యాత్రికులే చూసుకోవాలి.

టికెట్ బుకింగ్ ఇలా..

ప్రత్యేక బస్సులకు టికెట్‌లను కాకినాడ బస్ డిపోలో, ఆన్‌లైన్‌లో, ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద ముందుగా పొందవచ్చు. భక్తులు బస్సు సరిపడా ఉండి కోరితే కావాల్సిన ప్రదేశానికి బస్సులు నేరుగా కూడా పంపుతారు. అద్దె ప్రాతిపదికన కూడా మొత్తం బస్సును బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఆయా బస్సుల రిజర్వేషన్ కోసం 9959225564, విచారణ కోసం 9959225543 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

అమలాపురం నుంచి ఇలా వెళ్లొచ్చు

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రాలను ఒకే రోజున దర్శించుకునే వీలుగా ప్రత్యేక బస్సులను అమలాపురం నుంచి కూడా ఏర్పాటు చేశారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలను దర్శించవచ్చు. ప్రతీ ఆదివారం రాత్రి 7 గంటలకు అమలాపురం నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. కార్తీకమాసంలో ఈనెల 17, 24 తేదీల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, వ్యాపారుల కోరిక మేరకు ఈనెలలో ప్రతి శనివారం రాత్రి 7గంటలకు బస్సులు బయలుదేరి ఆదివారం సెలవు రోజు కావడం వల్ల పంచారామాలను దర్శించుకునే విధంగా ఈనెల 16, 23 తేదీల్లో కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అమలాపురం నుంచి పెద్దలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రూ.950, అల్ట్రా డీలక్స్‌కు రూ.1170, సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.1220, పిల్లలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రూ.720, అల్ట్రాడీలక్స్‌కు రూ.880, సూపర్ లగ్జరీకి రూ.920 టిక్కెట్ ధర నిర్ణయించారు.

అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం

కార్తీకమాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులకు అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం ఉందని డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. యాత్రలకు వెళ్లేవారు అసిస్టెంట్ మేనేజర్ సెల్ 7013868687ను సంప్రదించవచ్చు. అడ్వాన్స్ రిజర్వేషన్‌కోసం 9959225576, 7382909620 నెంబర్లలోను సంప్రదించవచ్చు.

ఏకాదశ రుద్రుల దర్శనయాత్ర

అంబాజీపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో ఏకాదశ రుద్రుల శైవక్షేత్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో భక్తులు వేలసంఖ్యలో తరలివస్తున్నారు. 450 శతాబ్ధాల చరిత్ర కలిగిన జగన్నతోట ప్రభల ఉత్సవానికి 2020లో ప్రధాని మోదీ ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలంటూ అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశయూత్ సభ్యులకు లేఖను రాశారు. శృంగేరీ పీఠాధిపతి ఏకాదశ రుద్రులపై లేఖను అందించారు. ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన 74వ రిపబ్లిక్ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకాదశ రుద్రు ప్రభల శకటం వెళ్లడంతో జాతీయస్థాయిలో మరింత గుర్తింపు లభించింది. దీంతో కార్తీకమాసం సందర్భంగా ఏకాదశ రుద్రుల దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఏకాదశ రుద్రులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో కొలువై ఉన్నారు. అంబాజీపేట మండలంలో 9 గ్రామాలుండగా అయినవిల్లి, అమలాపురం మండలాల్లో నేదునూరు, పాలగుమ్మి గ్రామాలున్నాయి. కార్తీకమాసంతోపాటు ఇతర రోజుల్లో ఏకాదశ రుద్రులను ఒకేరోజు దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని పండితులు చెబుతారు. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి(తికాగ్నికాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి(కాలాగ్నిరుద్రుడు), వక్కలంక విశ్వేరస్వామి(త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి(నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మిచెన్నమల్లేశ్వరుడు(మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి(సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వర స్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని చెబుతున్నారు.

కొవ్వూరు నుంచి ప్రత్యేక బస్సులు

ఏకాదశ రుద్రుల దర్శనం కోసం కొవ్వూరు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. గతేడాది కూడా కొవ్వూరు డిపో నుంచి 100 బస్సుల వరకు రావడంతో ఈ ఏడాది దర్శనాల కోసం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దర్శనాల కోసం సోషల్‌మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అల్పాహారం, విందు ఏర్పాటు చేసేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 18, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులను కొవ్వూరు డిపో నుంచి వస్తాయి.

ఒకే కాన్పులో ముగ్గురు...

జీజీహెచ్(కాకినాడ) నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు ఓ గర్భిణీ జన్మనిచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా, తణుకుకి చెందిన తపస్విని నిండు గర్భిణీ కావడంతో కుటుంబీకులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేయడంతో ఈనెల 6న జీజీహెచ్‌కు తరలించారు. ఈ నెల 8న మధ్యాహ్నం 1.34 నిమిషాల 34 సెకన్‌లకు మగ బిడ్డ, 1.34 నిమిషాల 48 సెకన్‌లకు ఆడబిడ్డ, 1.35 నిమిషాల 54 సెకన్‌లకు మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గైనిక్ విభాగాధిపతి డాక్టర్ అనురాగమయి సూచనలతో గైనిక్ వైద్యులు కాన్పు చేయగా పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు బృందం ముగ్గురు శిశువులను పూర్తి ఆరోగ్యవంతులుగా చేశారు. పిల్లలు పూర్తి ఆరోగ్యవంతులు కావడంతో తండ్రి తానేటి రాజు, తల్లి తపస్విని గైనిక్, పిడియాట్రిక్స్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు కవలలు

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

● జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ ● డీసీవో, డీసీసీబీల్లో సహకార వారోత్సవాలు ప్రారంభం

కాకినాడ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషిచేయాలని కాకినాడ జిల్లా సహకార అధికారి(డీసీవో) జి.వెంకటకృష్ణ కోరారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా సహకార సదన్, డీసీవో కార్యాలయం, నాగమల్లితోట జంక్షన్‌లోని డీసీసీబీలోనూ డీసీవో సప్తవర్ణ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20 వరకు సహకార వారోత్సవాలు జరుగుతాయన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అంశంపై వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహకార వ్యవస్థ ఏర్పడి 120 ఏళ్లు పైబడినా అనుకున్నంత ఫలితాలు సాధించలేదన్నారు. డీసీసీబీ సీఈవో నరసింహారావు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రైతునేస్తం కింద రూ.545 కోట్లు రుణాలిచ్చామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 298 పీఏసీఎస్‌ల ద్వారా 6.50 లక్షల మంది సభ్యులకు మెరుగైన సేవలందిస్తున్నామని తెలిపారు. సహకార వారోత్సవాలు ప్రాముఖ్యతపై వారోత్సవాల ఇన్‌ఛార్జ్ ఆదిమాలం వెంకటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎమ్ సోము నాయుడు, డీసీసీబీ జీఎం పి.ప్రవీణ్‌కుమార్, డీఎల్‌సీవో దుర్గాప్రసాద్, డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సహకార వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

పారామెడికల్ కోర్సులకు 19న కౌన్సెలింగ్

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సుల్లో 2024-2025 విద్యా సంవత్సరానికిగాను లెఫ్ట్ ఓవర్ సీట్ల ప్రవేశానికి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఈనెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉభయ గోదావరి జిల్లాకి చెందిన దరఖాస్తుదారులు ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆర్ఎంసీ అధికారులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు https://rmckakinada.com వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.



దర్శనానంతరం దేవస్థానం అధికారులతో సుస్మిత

సత్యదేవుని సన్నిధిలో మెగాస్టార్ కుమార్తె

అన్నవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన రత్నగిరిపై గురువారం జరిగిన ఆత్మీయురాలి వివాహానికి మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుస్మిత హాజరయ్యారు. సత్యదేవుని ఆలయానికి వెళ్లిన ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు కొండలరావు, బలువు సత్యశ్రీనివాస్, గంటా విష్ణు, పోల్నాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న భద్రయ్య

అంతరిక్ష యాత్రకు అవకాశం కల్పించాలని వినతి

చింతూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష యాత్ర చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని దూబి భద్రయ్య కొంతకాలంగా పలువురు అధికారులను అభ్యర్థిస్తున్నాడు. గురువారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశాడు. మండలంలోని కొత్తపల్లికి చెందిన ఆదివాసీ యువకుడైన భద్రయ్య 2016 మే 20న ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాడు. అంతరిక్ష యాత్ర తన లక్ష్యమంటున్నాడు. ప్రభుత్వం తనకు అవకాశం కల్పించే దిశగా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ని కోరినట్టు భద్రయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు 17న క్రీడాకారుల ఎంపిక

సామర్లకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున పురుషులు, మహిళా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 17న కాకినాడ జిల్లా సామర్లకోట ఆయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు 85 కిలోల లోపు బరువు ఉన్నవారు, మహిళలు 75 కిలోల లోపు బరువు వున్న వారు హాజరుకావాలన్నారు. ట్రయల్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. వారు డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపాన గల సంతనూతులపాడులో జరిగే 71వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారన్నారు.



హార్బర్ ప్రాంతంలో టెట్రా ప్యాడ్స్‌ను ఢీకొని ముక్కలైన బోటు

బండరాళ్లను ఢీకొట్టి ముక్కలైన బోటు

కొత్తపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం ఉప్పొంగుతోంది. గురువారం ఉదయం కాకినాడ జిల్లా ఉప్పాడ-అమీనబాద్ మినీ హార్బర్ ప్రాంతం నుంచి బొందు సంజీవి బోటు వేటకు వెళ్లింది. ఒడ్డుకు చేరే క్రమంలో కెరటాల ఉధృతికి హార్బర్ మొగలో వేసిన టెట్రా ప్యాడ్స్ రాళ్లను ఢీకొని ముక్కలైంది. బోటులో ఉన్న సంజీవిని, మిగిలిన మత్స్యకారులను దగ్గర్లో ఉన్న మత్స్యకారులు రక్షించారు. బోటు ముక్కలవ్వడంతో దానిలో ఉన్న వలలు సముద్రంలో కొట్టుకుపోయాయని మత్స్యకార నాయకుడు సూరాడ రాజు చెప్పారు. సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందన్నారు.

వీరభద్రుడి సంబరంలో అపశృతి

పూనకంతో మహిళ మృతి

కరప, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపమండలం గురజనాపల్లి శివారు అడవిపూడిలో గురువారం వీరభద్రుడి సంబరంలో అపశృతి జరిగింది. వీరభద్రుడి సంబరానికి అదే గ్రామానికి చెందిన గెద్దాడ సత్యనారాయణ, అతని భార్య సత్యవతి వెళ్లారు. సంబరం జరుగుతుండగా సత్యవతిపై వీరభద్రుడు పూనడంతో ఆమె భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. అకస్మాత్తుగా కడుపులో మంట రావడంతో కుటుంబ సభ్యులు నీళ్లు పట్టించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు.



రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో జరిగిన బాలల దినోత్సవ సభలో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదివా

» పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధ్యం: పీడీజే గంధం సునీత » భవిష్యత్తుపై అవగాహన ఉండాలి: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకున్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే మంచి అవకాశాలు రావనేది ఒక అపోహ మాత్రమే' అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి బాలల దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను సాధించడం తెలుగు మీడియం, ఇంగ్లీషు మీడియం అనే విధానాలపై ఆధారపడి ఉండదన్నారు. లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలే విజయానికి చేరువ చేస్తుందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకోర్చి పిల్లలను బడికి పంపిస్తారని, వాళ్లు మంచి స్థానానికి చేరాలని ఉపాధ్యాయులు భావిస్తారని.. వారి పేరును నిలిపేలా పిల్లలు ఇష్టంతో కష్టబడి చదువుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడలకూ తగిన ప్రాధాన్యమిస్తే అపజయాలను తట్టుకుని విజయాల వైపు దూసుకుపోయే మానసిక ధైర్యం వస్తుందన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత అనేవి మంచి జీవితాన్ని సొంతం చేస్తాయన్నారు. పిల్లలతో సమయం గడపడం ఆనందంగా ఉందన్నారు. వారికి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు పట్ల పూర్తి అవగాహన ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యపడుతుందన్నారు. జీవితంలో నిరంతర సాధన చేసి వారు ఎంచుకున్న రంగాల్లో రాణించిన వాళ్లు మన కళ్ల ముందు ఎందరో ఉన్నారన్నారు. గడిచిపోయిన కాలం ఎన్నటికీ తిరిగిరాదనే సత్యాన్ని నెమరు వేసుకుంటూ ప్రస్తుత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు మంచి నడవడిక అలవర్చడంలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు ప్రధాన భూమిక పోషించాల్సి ఉంటుందని చెప్పారు. తొలుత దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిప్రకాశనంతో వేడుకలను ప్రారంభించారు. బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పిల్లల జాతీయ నేతల వేషధారణ, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, జేసీ చిన్నరాముడు, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, డీఎస్ఈవో కె.వాసుదేవ రావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి: పీడీజే

డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. గురువారం ఆమె పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. పెండింగులో ఉన్న ఆ విధమైన కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు.

మర్డర్ ఫర్ గెయిన్ కేసులో భార్యభర్తలకు జీవిత ఖైదు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మర్డర్ ఫర్ గెయిన్ కేసులో భార్యభర్తలకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అడిషనల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి గురువారం తీర్పునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం గ్రామానికి చెందిన తురుబిల్లి రోహిణి (31) ఆమె తల్లితో కలిసి క్వారీ కెనాల్ రోడ్డులో వారి ఇంట్లో ఉండేవారు. అనంతపురానికి చెందిన చెక్కా పవన్‌కుమార్ యాదవ్ అలియాస్ యాదవ్, అతని భార్య కళ్ళు లక్ష్మి అలియాస్ లక్కీ రోహిణి ఇంట్లో పోర్షన్‌లో అద్దెకు దిగారు. 2020 జూన్ 26న ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో రోహిణిని యాదవ్, లక్ష్మి హత్యచేసి బంగారు గొలుసు లాక్కుని ఆమె తల్లిని గాయపరిచి పారిపోయారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు మర్డర్ ఫర్ గైన్ కేసుగా నమోదు చేశారు. ఈ కేసులో అప్పటి ఎస్పీ ఉత్తర్వుల మేరకు అప్పటి సీఐ ఎ.శ్రీను సమగ్ర దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో పీపీ పీవీవీఎస్‌బీ రాజు ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనాలు వినిపించారు. నేరం రుజువు కావడంతో దంపతులకు జీవిత ఖైదు, జరిమానా విధించారు.

కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

పుట్టినరోజు జరుపుకున్న రెండు రోజులకే...!

గొల్లప్రోలు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామల కట్నం వేధింపులు భరించలేక రైల్లోంచి దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చదలాడ గ్రామానికి చెందిన వరుపుల దివ్య (28)కి గొల్లప్రోలు పట్టణానికి చెందిన తొగరు రమేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచీ భర్త, అత్తమామలు అదనపు కట్నం కావాలని సూటిపోటి మాటలతో వేధించేవారని దివ్య పలుమార్లు తల్లిదండ్రులు, బంధువులకు చెప్పి బాధపడేది. బుధవారం సాయంత్రం పిఠాపురంలోని తల్లీపిల్లల ఆసుపత్రికి వచ్చిన ఆమె తాను పిఠాపురం రైల్వే స్టేషన్‌లో ఉన్నానని... భర్త, అత్తమామల వేధింపులు భరించలేక చనిపోతున్నానంటూ బంధువుల ఫోన్లకు మెసేజ్ పెట్టింది. దీంతో కుటుంబసభ్యులు వెతుకులాట ప్రారంభించారు. మల్లవరం, దుర్గాడ రైల్వేగేటు మధ్య దివ్య ట్రాక్ పక్కనే పడి ఉండడాన్ని గుర్తించారు. ఆమె రైలు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కట్నం వేధింపులతోనే ఆమె చనిపోయిందని తెలిపారు. కాగా ఈ నెల 11న కుటుంబసభ్యులతో కలిసి పుట్టినరోజు జరుపుకోవడంతో పాటు తాను ప్రెగ్నెంట్ అని చెప్పిందని, అదే సమయంలో అత్తింటివారు సూటిపోటి మాటలతో హింసిస్తున్నారని బాధపడినట్టు దివ్య సోదరుడు చెప్పాడు. ఇంతలోనే ఇలా జరుగుతుందని భావించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దివ్య (పాత చిత్రం)

బాలిక అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ

యువకుడి అరెస్టు... పోక్సో కేసు నమోదు

ప్రత్తిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మినర్వా జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం మిస్టరీ కేసు వీడింది. బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన యువకుడిని ప్రత్తిపాడు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం విలేకరులకు వివరించారు. ఎస్ఐ కథనం మేరకు.. కొడవలి గ్రామానికి చెందిన బాలిక అక్టోబరు 22న ప్రత్తిపాడు మినర్వా కాలేజీ నుంచి అదృశ్యమైనట్టు బాలిక తల్లి నూకరత్నం ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుమార్తె అదృశ్యంపై బాలిక తల్లిదండ్రులు ప్రత్తిపాడులో మీడియా సమావేశం నిర్వహించి ఎక్కడ ఉందో ఆచూకీ తెలపాలని కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్, డీఎస్పీ శ్రీహరిరాజు సూచనల మేరకు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో ఎస్ఐ లక్ష్మీకాంతం బాలిక అదృశ్యం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో దర్యాప్తు ముమ్మరంగా నిర్వహించి ఎట్టకేలకు బాలిక ఆచూకీ కనుగొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కొడవలి గ్రామానికి చెందిన బొద్దు ప్రకాష్ అనే జాన్‌ను ప్రత్తిపాడు శివారు పాదాలమ్మ గుడి వద్ద పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. బాలిక ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఈ కేసులో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. .

గమ్ అంటించాడని గుంజీలు తీయించారు

కాట్రేనికోన, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒక విద్యార్థి మరో విద్యార్థికి గమ్ అంటించాడన్న కోపంతో ఉపాధ్యాయుని ఆదేశంతో గుంజీలు తీసిన విద్యార్థి ఆసుపత్రి పాలయ్యాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పి.లక్ష్మివాడ హైస్కూల్లో చదువుతున్న మడికి రవితేజ మరో విద్యార్థికి గమ్ అంటించాడు. ఈ ఆరోపణతో 110 గుంజీలు తీయాలని రవితేజ ఉపాధ్యాయుడు ఆదేశించాడు. గుంజీలు తీసిన అనంతరం అతడు మోకాళ్ల వాపుతో కాట్రేనికోన పీహెచ్‌సీకి వచ్చాడు.



గౌరిదేవిపేటలో సాగు చేసిన మినుము పంట



గన్నవరంలో సాగు చేసిన లంక పొగాకు పంట

మిర్చి... నష్టాలు మూటగట్టి!

ఎటపాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మన్యంలో సిరులు పండించే మిర్చి పంటను ఈ ఏడాది రైతులు అంతంతగానే సాగు చేశారు. ఒకప్పుడు చిన్న, సన్నకారు రైతులకు సిరులు కురిపించే కల్పవృక్షంగా మారిన మిర్చి సాగును ఈసారి పంట మార్పిడి విధానంతో తగ్గించారు. గతంలో పది ఎకరాలు సాగు చేసిన రైతులు ఈసారి రెండు ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులైతే మిర్చి సాగు దరిదాపుల్లోకి పోలేదు. తమవల్ల కాదని చెప్తున్నారు. గత మూడేళ్లుగా వరుస నష్టాలు చవిచూసి కుదేలైన వారు ఈసారి మిర్చి సాగుకు ఆసక్తి కనబర్చలేదు. ప్రత్నామ్నాయంగా మినుము, లంగ పొగాకు సాగువైపు అడుగులు వేస్తున్నారు. దీంతో ఏజెన్సీలో ఈసారి మినుము పంట సాగు విస్తీర్ణం పెరిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.


మన్యంలో సిరులు కురిపించే మిర్చి పంటను రెండు దశాబ్దాలకు పైగా రైతులు విరామం లేకుండా సాగు చేస్తున్నారు. ఐదారేళ్ల క్రితం ఎటపాక మండలంలో ఐదారు వేల ఎకరాల్లో సాగు అయ్యేది. ఆ సమయలో దిగుబడి కూడా ఆశాజనకంగా వచ్చి లాభాలు అధికంగా చూసేవారు. దాంతో జగదల్‌పూర్, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి మిర్చి కొనుగోలు వ్యాపారస్తులు ఇక్కడకు వచ్చి.... ఈ ప్రాంత రైతులకు పంట సాగుకు ముందే పెట్టుబడులు ఇచ్చి వేళ్లేవారు. అలా పండిన పంటను రైతులు వారికి అమ్ముకునేవారు. కాగా ఐదారేళ్లుగా వ్యాపారస్తులు ఈ ప్రాంత రైతులకు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావట్లేదు. మిర్చి రైతులకు వరస నష్టాలు, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడమే కారణం. ఈ కారణంగా ఏజెన్సీ మండలాల్లో గత రెండేళ్లుగా మిర్చి సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. గతేడాది సుమారు 3,300 ఎకరాల్లో సాగు అవ్వగా ఈ ఏడాది కేవలం 1,800 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. రైతులు పంట సాగు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉండి గత నెల చివరి వరకు సాగు చేశారు.

> రెండు దశాబ్దాలుగా విరామం లేకుండా మిర్చి సాగు
> మూడేళ్లుగా వరస నష్టాలతో కుదేలు
> ఈసారీ అంతంతమాత్రమే.
> ప్రత్నామ్నాయంపై రైతుల చూపు
> ఏజెన్సీలో పెరిగిన వినుము, లంక పొగాకు సాగు

మన్యంలో మిర్చి రైతులు గత మూడేళ్లుగా వరుస నష్టాలను చూవిచూస్తున్నారు. కనీసం పెట్టుబడులు కూడా రాక నష్టాలు మూటగట్టుకున్నారు. మిర్చి పంటకు నల్లి తామర పురుగుతో పాటు వైరస్‌లు సోకడంతో ఆదిలోనే పంట నాశనమైంది. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టి అప్పులపాలయ్యారు. ఎకరా మిర్చి తోటలో బస్తా మిర్చిని కూడా సేకరించలేకపోయారు. 10 ఎకరాలు పైబడి సాగు చేసిన రైతులు నట్టేట మునిగారు. అప్పులిచ్చిన వారికి ఇంట్లోని బంగారం, బయట రూ.5 నుంచి రూ.10 వడ్డీకి తెచ్చి సగం అప్పులు తీర్చారు. ఈ ఏడాది పంట అమ్మిన తర్వాత తీర్చుతామంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు.

మిర్చి బదులు లంక పొగాకు

మందలపు సత్యనారాయణ, రైతు, గన్నవరం



గత ఏడాది పది ఎకరాల్లో రూ.11లక్షల పెట్టుబడితో మిర్చి పంట సాగు చేశాను. నల్లితామర పురుగు ఆశించడంతో పంట పూర్తిగా దెబ్బతింది. సుమారు 10 లక్షల వరకు నష్టపోయాను. ఈసారి మిర్చి బదులు పది ఎకరాల్లో లంక పొగాకు సాగు చేశాను. మిర్చిని పూర్తిగా వదిలేశాను. లంక పొగాకు కూడా ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

మిర్చితో రూ.3 లక్షలు నష్టపోయా

చిచ్చడి బాలరాజు, రైతు, కృష్ణవరం



గత ఏడాది రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. నల్లితామర పురుగు, వైరస్ ప్రభావంతో పంట దిగుబడి లేకుండా పోయింది. పెట్టుబడి పెట్టిన రూ.3లక్షలు నష్టం వాటిల్లింది. ఇక మిర్చి సాగు చేయకూడదని నిర్ణయించుకున్నా. ఈ ఏడాది రెండు ఎకరాల్లో లంక పొగాకు సాగు చేశాను. పంట ప్రస్తుతం బాగానే ఉంది. ప్రయివేట్ కంపెనీ వారు క్వింటాకు పదహారు వేలు ఇస్తామని చెప్పారు.

ప్రత్నామ్నాయ పంటల వైపు రైతుల ఆసక్తి

మిర్చి పంటకు వరస నష్టాలతో రైతులు ఏడాది ప్రత్నామ్నాయ పంటల సాగువైపు ఆసక్తి కనబరుస్తున్నారు. దాంతో విలీన మండలాల్లో ఈసారి మిర్చికి బదులు మినుము, లంక పొగాకు, జామాయిల్ పంటల సాగు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఎటపాక మండలంలో ఐదు వందల ఎకరాల్లో సాగైన మినుము, ఈఏడాది సుమారు వెయ్యి ఎకరాలకు పెరిగింది. లంక పొగాకు కూడా 300 ఎకరాల్లో సాగు చేశారు. అపరాల పంట నాలుగు వందల ఎకరాలకు పెరిగింది. కొందరు మిర్చి రైతులు కూరగాయలు పండిస్తున్నారు. జామాయిల్ సాగు ఈసారి సుమారు 900 ఎకరాల వరకు పెరిగింది. ప్రయివేట్ బ్రాండ్ మొక్క జొన్న సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. అయితే ఈ ఏడాది అంతంత మాత్రంగా మిర్చి పంట సాగు చేసిన రైతులు మిర్చిపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటివరకు బాగానే ఉందని చెప్తున్నారు.

వీరేశ్వరాలయంలో అయ్యప్పల పూజలు

ఐ.పోలవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గురువారం మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం అయ్యప్ప భక్తుల శరణు ఘోషతో మార్మోగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు వీరేశ్వరాలయానికి తరలి వచ్చి ఇరుముడులు ధరించారు. తొలుత స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

గ్రామాల్లో ఇరుముడుల సందడి

మామిడికుదురు,నవంబరు14(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష పూర్తిచేసిన స్వాములకు గురుస్వామి కొర్లపాటి రామారావు అప్పనపల్లిలోని శ్రీఅన్నపూర్ణా విశ్వేశ్వరస్వామి ఆలయంలో 17మందికి, పాశర్లపూడి శివాలయంలో 10మందికి ఇరుముడులు కట్టారు. ఆలయాలు అయ్యప్పస్వామి శరణుతో మార్మోగాయి.స్వాములు శబరిమల బయలుదేరారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో గురువారం జాతీయ వారోత్సవాలను ప్రారంభించారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, హెచ్ఎం బందా ఆర్.కామేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, ఆకుల భవానీ తదితరులు పాల్గొన్నారు. సవరప్పాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎన్వీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు. సమనస గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వైటీఎస్ రాజు అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి సత్యశ్రీరంగం సమకూర్చిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.



అమలాపురం: గ్రంథాలయ వారోత్సవాల సభలో మాట్లాడుతున్న డీవైఈవో సూర్యప్రకాశం

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎలిమెంటరీ స్కూలు హెచ్ఎం కె.వీరరాఘవరావు జ్యోతి ప్రజ్వలనచేసి వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. ముమ్మిడివరం గ్రంథాలయ శాఖలో లైబ్రేరియన్ శీలం నాగరాజు ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పాఠకులు, లైబ్రేరియన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జి.రవికుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో కేవీ ప్రసాద్ వారోత్సవాలను ప్రారంభించి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్, విశ్రాంత ఉపాధ్యాయులు సాకా సత్యం, గుడాల సంపందరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐ.పోలవరం,(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. ఎంఈవోలు కొండారెడ్డి, తిరుమలరావు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి అంబటి వెంకటనారాయణ, హైస్కూల్ హెచ్ఎం వీధి సురేష్ పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ వారోత్సవాలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్ గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. లైబ్రేరియన్ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని అయినవిల్లి శాఖ గ్రంథాలయ అధికారిణి ఎస్.జయశీల ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బాలబాలికలకు నెహ్రూ జీవిత విశేషాలను వివరించారు. తొలుత గ్రంథాలయ అధికారిణి జయశీల వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ స్కూలు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): గ్రంథాయాల్లో ఉన్న పుస్తక పఠనంతో ఉద్యోగ పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో-2 మోకా ప్రకాష్ సూచించారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలోవారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 20న విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. హెచ్ఎం కె.సాయిరామ్, ఉపాధ్యాయులు ఎస్.వెం కటేశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపాలెం గ్రామంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను అంతర్వేదిపాలెం హైస్కూలు హెచ్ఎం జాన కనకలింగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతా శ్యామ్‌బాబు, ఎ.నాగేశ్వరరావు, వివేకానంద, జె.మేరీ, ఈశ్వరరావు, గెడ్డం బాలరాజు, గ్రంథాలయ అధికారి వై.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



మామిడికుదురు దీప్తి స్కూలులో చిల్డ్రన్స్‌డే పురస్కరించుకుని చిన్నారుల వేషధారణలు

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో నెహ్రూ వీధిలోని విగ్రహానికి పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ హయాంలో సాధించిన విజయాలను వక్తలు వివరించారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, మహబూబ్ షకీలా, మొల్లేటి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల కుమార్‌సింగ్‌పాల్గొన్నారు. గొల్లగూడెం ఆదిత్య పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ముమ్మిడివరం,(ఆంధ్రజ్యోతి): రాణేలంకలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యాక్షన్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్‌వారి సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎంఎస్సార్ కిశోర్, ప్రాజెక్టు మేనేజర్‌జి.శ్రీను, వైస్ ప్రిన్సిపాల్ శివప్రవీణ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని మామిడికుదురు దీప్తి స్కూలులో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నెహ్రూ వేషధారణల్లో, ఆట పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ అందించారు. నగరంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జవహర్‌లాల్‌నెహ్రూ పుట్టినరోజు వేడుకలు నిర్వహించి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అప్పన శ్రీరామకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్రప్రసాద్, కొండేటి వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్నిపోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు ఉపాధ్యాయ దంపతులను సన్మానించారు. అలాగే లంకల గన్నవరం శివారు మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో జనని ఫౌండేషన్ చైర్మన్ సరెళ్ళ ప్రసాద్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం బి.దుర్గారావు, యన్నాబత్తుల ఆనంద్, ఎస్.నాగలక్ష్మి, కోట రామకృష్ణ, మాతా పద్మలత, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట హైస్కూల్‌లో తొలి ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబాజీపేట, తొండవరం హెచ్ఎంలు కె.సాయిరామ్, పీవీ.కేశవాచార్యులు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం రోజు గురువారం ఉప్పలగుప్తం, భీమనపల్లి శాఖా గ్రంథాలయాల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుకుమార్, కవి నల్లా నరసింహమూర్తి, వీఆర్వో అవిడి రాము, నిమ్మకాయల రామబ్రహ్మం, షైనర్ రాజు పాల్గొన్నారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో జరిగిన బాలల దినోత్సవంలో విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ, అరవ స్వామినాయుడు, ఆర్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి):గోడి గురుకుల బాలికల కళాశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులను సామాజికవేత్త, మాజీ చైర్మన్ కోట హనుమంతరావు జ్ఞాపికలను అందించి సత్కరించారు. ప్రిన్సిపాల్ శిష్లా కిరణ్మయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్, సైన్సు ఫెయిర్, విద్యలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను హనుమంతరావు సత్కరించారు. కె.మౌనిక, రత్నం, పి.శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతర్వేది అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులతో బాలల దినోత్సవం నిర్వహించి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆటలు, పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

చేనేత వర్క్ షెడ్ల నిర్మాణ లబ్ధిని విడుదల చేయాలి



ఎంపీ హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత సంఘ నాయకుడు అంకం వీర్రాజు తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా అమలు చేస్తున్న హత్ ఖార్గ్ సంవర్ధక సహాయక్‌లో భాగంగా చేనేత కార్మికుల ఆర్థిక లబ్ధిని తక్షణం విడుదల చేయాలని అయినవిల్లి మాజీ జడ్పీటీసీ గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ-శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేనేత సంఘ మాజీ అధ్యక్షుడు అంకం వీర్రాజు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎంపికైన 42మంది కార్మికులకు ఆర్థిక లబ్ధిని విడుదల చేయించాలని కోరారు. మండలంలో 110మంది చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోగా 42 మందిని అర్హులుగా గుర్తించారని, ఒక్కో యూనిట్‌కు రూ.1.20లక్షలు ఉచిత ఆర్థికసాయం అందించాల్సి ఉందని వివరించారు. చేనేత కార్మికులు జీవనోపాధిని మెరుగు పరుచుకోవడానికి వ్యక్తిగత వర్క్‌షెడ్లు (మగ్గాలు) ఎంతో అవసరమని చేనేత, జౌళిశాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుడైన ఎంపీ హరీష్‌మాధుర్‌కు వివరించారు. చేనేత కమిషన్‌ను కలుసుకుని వర్క్‌షెడ్ల నిర్మాణ లబ్ధిని విడుదల చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సంఘ సభ్యులు పి.దివ్యమూర్తి, అంకం బసవరాజు పాల్గొన్నారు.

సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తిచేయాలి

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలోని సహకార సంఘాల కంప్యూటరీకరణను త్వరితగతిన పూర్తి చేయడం వల్ల సభ్యులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ తెలిపారు. దేశవ్యాప్తంగా సహకార సంఘాలన్నింటినీ కంప్యూటరీకరణలోకి తీసుకువస్తున్నట్టు చెప్పారు. గురువారం జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద సప్తవర్ణ పతాకాన్ని డీసీసీబీ బ్రాంచి సీనియర్ మేనేజర్ కేవీఎస్‌వీఎస్ఎన్ మూర్తితో కలిసి మురళీకృష్ణ ఆవిష్కరించారు. వారోత్సవాల ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన సహకార వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించి సహకార ప్రతిజ్ఞ చేయించారు. డివిజన్ సహకార అధికారి ఎ.రాధాకృష్ణరావు, నోడల్ ఆఫీసర్ పి.శ్రీనివాస్, డీసీసీబీ సిబ్బంది, సహకార సంఘాల సీఈవోలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మలికిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని గురువారం విజయవాడ ఆంధ్రారత్న భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్టు పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు తెలిపారు. రాష్ట్రంలో రాజకీయాలు, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం గురించి మాట్లాడినట్టు తెలిపారు. త్వరలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లను మార్పు చేయనున్నట్టు తెలిపారని గోపాలకృష్ణ చెప్పారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం



యానాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం విద్యా శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో బాలల దినోత్సవం నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారి రెయ్యి శ్రీనివాస్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్ అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ ఉంటే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు,ఆటల పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందించారు. పరిపాలనాధికారి మునిస్వామి,మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సర్వశిక్ష అభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరల అదుపునకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట సీపీఎం ప్రజాపోరు ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను అదుపు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనె ధరలుఆకాశాన్ని అంటినందున చౌకధరల దుకాణాల ద్వారా వాటిని సామాన్యులకు అందుబాటు ధరలో అందించాలన్నారు. సీపీఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి గురువారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డీఎస్సీ వాయిదా పడిందని, గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించలేదని సుబ్బరావమ్మ అన్నారు. ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం అమలులోకి రాకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులతో పాటు ఎన్నో రంగాలకు చెందిన కార్మికులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వోకు అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, టి.నాగవరలక్ష్మి, పీతల రామచంద్రరావు, జిల్లా నాయకులు విత్తనాల రాంబాబు, ఎన్.చినసత్యనారాయణ, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, అయితాబత్తుల రమేష్, పచ్చిమాల నాగమణి, జె.సీత, వంగలపూడి మంగమ్మ పాల్గొన్నారు.

చదువుతో పాటు గేమ్స్ అవసరం



ముమ్మిడివరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ఎంతో అవసరమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ఇటీవల ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ కళాశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం ఎంపీ అభినందించారు. కాకినాడ పీఆర్ కళాశాల విద్యార్థి ఎ.సత్యనారాయణ (బంగారు పతకం), అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల విద్యార్థి సంసాని నాగసత్యనారాయణ సిల్వర్ మెడల్, కాకినాడ సూరపాలెం ఆదిత్య కళాశాల దొమ్మేటి వేణుమణికంఠ, స్కూల్‌గేమ్స్ అండర్-17 పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ముమ్మిడివరం ఎంజీఆర్ కళాశాల విద్యార్థి పాలెపు రమేష్, అమలాపురం నారాయణ కళాశాల ఇంటర్ విద్యార్థి సాగర్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కోచ్ వాసంశెట్టి నరేష్, సర్పంచ్ గొలకోటి దొరబాబు, గెడ్డం శ్రీను, పితాని నరసింహమూర్తి, దొంగ గంగాధర్ పాల్గొన్నారు.

రూ.2లక్షల బీమా చెక్కు అందజేత

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం భారతీయ స్టేట్ బ్యాంకులో సేవింగ్ ఖాతా కలిగిన అజ్జరపు సత్యనారాయణ ఆకస్మికంగా మృతిచెందడంతో భార్య రత్నంకు గురువారం అమలాపురం స్టేట్ బ్యాంకు రీజనల్ కార్యాలయంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రూ.2లక్షల చెక్కును రీజనల్ మేనేజర్ ఎంవీవీఎం కృష్ణ అందజేశారు. ప్రతీ ఏడాది ఖాతాదారుడు రూ.436 చొప్పున ప్రీమియం చెల్లిస్తే ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన వర్తిస్తుందన్నారు. యాభై ఏళ్లలోపు ఖాతాదారులు ఈపథకంలో చేరేందుకు అర్హులన్నారు. ముక్తేశ్వరం బ్రాంచి మేనేజర్ కేవీ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

డీపీఎస్‌లో స్పేస్ ల్యాబ్ ప్రారంభం

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఏర్పాటుచేసిన స్పేస్ ల్యాబ్‌ను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ప్రారంభించారు. అంతరిక్షంపై విద్యార్థి దశ నుంచి అవగాహన పెంపొందించేందుకు స్పేస్ ల్యాబ్ ఎంతో దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు. డీవైఈవో జి.సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ నంద్యాల నాయుడు, డైరెక్టర్లు నంద్యాల మనువిహార్, స్నేహప్రియ, సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

మలికిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలు సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా అన్నారు. మలికిపురంలో కె.కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో పార్టీ సాధారణ సభ్యత్వ నమోదు గురించి చర్చించారు. ప్రధాని మోదీ దేశంలో అందిస్తున్న సుపరిపాలన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాస్‌నగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, ఇందుకూరి అచ్యుతరామరాజు, ఆరేటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలతో పాటు బిల్లులను వెంటనే చెల్లించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు గురువారం ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) లేఖ అందజేశారు. పాఠశాలల్లో ఆయాలకు బకాయి పడ్డ వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సెప్టెంబరు, అక్టోబరు వేతనాలు, వంట బిల్లులుఇంత వరకు చెల్లించలేదన్నారు. చిరుద్యోగులను ఆదుకునేలా బకాయిలు విడుదల చేయాలన్నారు.

అముడా చైర్మన్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన అల్లాడ స్వామినాయుడును గురువారం బులియన్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దెందుకూరి



అల్లవరం,నవంబరు14(ఆంధ్రజ్యోతి): క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజును కూటమి ప్రభుత్వం నియమించింది. గోడి పంచాయతీ ఉపసర్పంచ్‌గా, టీడీపీ మండల అధ్యక్షుడిగా ఆయన ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు దెందుకూరిని అభినందించారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

ముమ్మిడివరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పార్టీకి కష్టపడి అంకిత భావంతో పనిచేసే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. చినకొత్తలంక గ్రామానికి చెందిన గొల్లపల్లి ధర్మారావును రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా పార్టీ నియమించింది. ఈసందర్భంగా తెలుగు యువత మండల అధ్యక్షుడు రవివర్మ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. గొల్లపల్లి పార్టీకి అందించిన సేవలను గుర్తించి రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారన్నారు. కార్యక్రమంలో కొత్తూరి మల్లికార్జునవర్మ, గుత్తుల సత్యనారాయణ, పొత్తూరి రేణుక, పంతగడ సత్యనారాయణ, గుత్తాల లీలావతి, పెద్దిరెడ్డి సత్యగోపాలకృష్ణ, గుత్తుల నాగేంద్ర వరప్రసాద్, పొత్తూరి శివరామకృష్ణంరాజు, పొత్తూరి నాగబాబు, పచ్చమట్ల సీతారామరాజు, పిల్లా సూర్యనారాయణమూర్తి, నాగులపల్లి బాలయోగి పాల్గొన్నారు.

బాధ్యతాయుతమైన సేవలందించాలి

ముమ్మిడివరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సిబ్బంది అంతా సకాలంలో విధులకు హాజరై సేవలు అందించాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో గురువారం అవుట్ సోర్సింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నగర పంచాయతీ అభివృద్ధిలో ఉద్యోగులంతా భాగస్వాములు కావాలన్నారు. అవగాహన సదస్సులో మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ పీవీ సుధాకర్, ఆర్ఐ భాస్కరరావు, ఏఏవో రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ ఏఎస్ఎన్ రాజు, సీనియర్ అక్కౌంటెంట్ సుబ్బారావు, సచివాలయ, నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని 108కాంట్రాక్టు ఉద్యోగులు వినతిపత్రాలను గురువారం తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో అందించారు. రాష్ట్ర ప్రభుత్వం 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈనెల28వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట

అల్లవరం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లను నెరవేర్చకుంటే యూనియన్ పిలుపు మేరకు నవంబరు 25 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని 108 సర్వీసు సిబ్బంది చెప్పారు. హామీలను నెరవేర్చాలని, మరమ్మతులకు గురవుతున్న 108అంబులెన్స్‌ల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహశీల్దారు బీవీ నరసింహారావుకు వినతిపత్రాలను అందచేశారు. 108 సిబ్బంది కుడుపూడి తాతాజీ, దొమ్మేటి రామకృష్ణ, దొమ్మేటి శ్రీనివాస్, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకున్న సర్పంచ్

కాట్రేనికోన,నవంబరు14(ఆంధ్రజ్యోతి):అన్నాక్యాంటీన్ ఫౌండేషన్‌సమీపంలో ఒక వ్యక్తి కాల్వగట్టును ఆక్రమించుకున్నాడు. శ్మశానికి వెళ్లే దారి ఆక్రమణలకు గురవుతోందని ఆప్రాంత వాసులు బుధవారం ఆందోళన చేశారు. కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ స్పందించి ఆక్రమణను అడ్డుకున్నారు.

కుండలేశ్వరంలో భక్తజనం పూజలు

కాట్రేనికోన, నవంబరు14(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో గురువారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు.ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. సీహెచ్ గున్నేపల్లికి చెందిన గొలకోటి నిర్వహించిన అన్నసమారాధనలో వెయ్యి మంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణలో వైఫల్యం



మున్సిపల్ కమిషనర్ రాజుతో ఏఐటీయూసీ నాయకుల సమావేశం

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పారిశుధ్య విధానం అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని, కనీసం తడిచెత్త, పొడిచెత్త సేకరణ కార్యక్రమం సైతం పేవలంగా తయారైందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులకు కమిషనర్ గురువారం సమావేశం నిర్వహించారు. పారిశుధ్య పనుల్లో ఇబ్బందులు, లోపాలను గుర్తించి సత్వరం పరిష్కరించాలని, ఆటో టిప్పర్ కార్మికుల వేతనాలు ప్రతీ నెల 5వ తేదీన జమ చేయాలని ఇలా పలు అంశాలను కమిషనర్ దృష్టికి ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల బాబీ, కానేటి వెంకట్రావు, దంగేటి శ్రీను, బవిరిశెట్టి రాంబాబు, మన్నే ఏడుకొండలు, నిమ్మకాయల సత్యవతి, అమలదాసు గోవిందమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈనెల15న కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం 11కేవీ లైన్‌లో చెట్లుకొమ్మల తొలగింపు నిమిత్తం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు.

సొసైటీ మాజీ చైర్మన్ సేవలు చిరస్మరణీయం

మామిడికుదురు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సొసైటీ మాజీ చైర్మన్‌గా, మండల మాలమహానాడు అధ్యక్షుడిగా యూవీవీ సత్యనారాయణ చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. యూవీవీ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

క్రియాశీల సభ్యులుగా నమోదవ్వాలి

మామిడికుదురు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో వందకు మించి క్రియాశీల సభ్యత్వాలను నమోదయ్యేలా చూడాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా సూచించారు. మామిడికుదురులోని అంబేడ్కర్ సామాజిక భవనంలో మండలశాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాడి సత్తిబాబు, కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, షంషూ సాదిక్, అడబాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు

అంబాజీపేట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తుందని తహసీల్దారు జె.వెంకటేశ్వరి అన్నారు. నందంపూడి, వాకలగరువు పంచాయతీల వద్ద రెవెన్యూ సదస్సును సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు అధ్యక్షతన నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ రికార్డులు, సర్వేలో తప్పులను సరిచేసుకునేందుకు గ్రామసభల్లో అవకాశం ఉందన్నారు. ఎంపీటీసీలు వాకపల్లి దొరబాబు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుల బైండోవర్

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు నిర్వహిస్తున్న గుబ్బల సత్యనారాయణ, ర్యాలి సత్యనారాయణలను బైండోవర్ చేసి అంబాజీపేట తహశీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. బెల్టుషాపు నిర్వాహకులు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించి విడుదల చేశారు.


జనసేన నేత పండుకు బ్రెయిన్ డెడ్

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బండారులంక చినచంద్రపురం ప్రాంతానికి చెందిన జనసేన చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సామాజిక సేవాపరుడు బట్టు నాగపుల్లేశ్వరరావు (పండు) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటీ స్కిడ్ అయి తలకు తీవ్ర గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయింది. రాత్రికి రాత్రి కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. బ్రెయిన్‌డెడ్‌తో ఉన్న పండును గురువారం రాత్రికి అమలాపురం ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పండు బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా కూడా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ముమ్మిడివరం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మిడివరం జడ్పీ బాలుర హైస్కూలులో చిల్డ్రన్స్‌డే సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగంలో పొందు పరిచిన హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, ముమ్మిడివరం ఎస్ఐ బి.జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

పార్టీలో కష్టించి పనిచేసిన వారికి ప్రాధాన్యం



అంబాజీపేట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. మాచవరంలో జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు, ఇరిగేషన్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, అభిమానుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. వెంకటేశ్వరరావు- గంగాభవాని దంపతులను వేదపండితులు ఆశీర్వచనం అందించారు.మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిసుబ్బారావు, డొక్కానాథ్‌బాబు, నల్లా శ్రీధర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, అరిగెల బలరామమూర్తి, బొంతు పెదబాబు, అడబాల తాతాకాపు పాల్గొన్నారు.

వీరేశ్వరాలయంలో అయ్యప్పల పూజలు

ఐ.పోలవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గురువారం మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం అయ్యప్ప భక్తుల శరణు ఘోషతో మార్మోగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు వీరేశ్వరాలయానికి తరలి వచ్చి ఇరుముడులు ధరించారు. తొలుత స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

గ్రామాల్లో ఇరుముడుల సందడి

మామిడికుదురు,నవంబరు14(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష పూర్తిచేసిన స్వాములకు గురుస్వామి కొర్లపాటి రామారావు అప్పనపల్లిలోని శ్రీఅన్నపూర్ణా విశ్వేశ్వరస్వామి ఆలయంలో 17మందికి, పాశర్లపూడి శివాలయంలో 10మందికి ఇరుముడులు కట్టారు. ఆలయాలు అయ్యప్పస్వామి శరణుతో మార్మోగాయి.స్వాములు శబరిమల బయలుదేరారు.

పసలపూడిలో ఘనంగా లక్ష బిల్వార్చన


పసలపూడిలో బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పసలపూడిలో అయ్యప్పస్వామికి బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్‌వీవీఎస్ఎన్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో చింతా సుబ్బారెడ్డి సౌజన్యంతో జరిగిన కార్యక్రమంలో తొలుతగా శ్రీమాణిక్యాంబ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, గణపతి హోమం నిర్వహించారు. ఆగమ పండితులు ఉండి సుబ్రహ్మణ్య శాస్త్రి, గణపతి హోమం, లక్ష బిల్వార్చన, అయ్యప్పస్వాములు పడిపూజ జరిపారు. పారిశ్రామికవేత్త చింతా సుబ్బారెడ్డి సౌజన్యంతో అయ్యప్ప మాలధారులు, శివమాలదారులకు భారీ అన్నసమారాధన జరిపారు. పసలపూడి, రామచంద్రపురం, చెల్లూరు పరిసర ప్రాంతా భక్తులు పాల్గొన్నారు.

శివపంచకోటి అక్షరగ్రంధ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగర-పడమరఖండ్రిక గ్రామాల్లో కొలువైయున్న శ్రీపార్వతీ ఉమామహేశ్వర, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం శివపంచకోటి అక్షర గ్రంధ ప్రతిష్ఠ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేక సహిత లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అంగర వాస్తవ్యులు కొమాళ్ళపల్లి సత్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో కొమాళ్ళపల్లి సత్యసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రీకంఠం మల్లేశ్వరశర్మ బ్రహ్మత్వంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. 16న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక వనసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

పాఠశాలలకు సౌండ్ సిస్టమ్స్ బహూకరణ


మైక్ సిస్టమ్‌ను అందిస్తున్న పద్మశ్రీ స్టీల్ కార్పోరేషన్ యజమాన్యం

రావులపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈతకోట జడ్పీ హైస్కూల్‌కు కొత్తపేట నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒంటిపల్లి పాపారావు రూ.43,500 విలువైన సౌండ్‌సిస్టమ్‌ను అందించారు. హెచ్‌ఎం కేవీస్వీ కృష్ణారెడ్డి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ పి.రమేష్ పాల్గొన్నారు. దేవరపల్లి జడ్పీ హైస్కూల్‌కు పద్మశ్రీ స్టీల్ కార్పొరేషన్ యజమాన్యం రూ.46వేలు విలువైన మైక్ సిస్టమ్‌ను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భమిడిపాటి సాయిరామ్, పాఠశాల ఛైర్మన్ విత్తనాల రామకృష్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తులాభారంతో అయ్యప్పస్వామికి మొక్కులు



ఆలమూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయంలో బాలుడికి తులాభారంతో భక్తులు గురువారం మొక్కులు తీర్చుకున్నారు. ఈదల శ్రీనివాస్ విజయలక్ష్మి దంపతుల మనవడుకి నాణేలు, పండ్లు, పట్టికి బెల్లంతో విడివిడిగా తులాభారం వేసి అయ్యప్ప స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా స్వామివారికి మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, పశువైద్యాధికారి ఈదల శ్రీనివాస్ అధ్వర్యంలో వివిద రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలమూరు ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా పుస్తకాలు, పెన్నులను మాజీ ఎమ్మెల్యే చిక్కిన అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు పరిష్కరించాలి



రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ గురువారం యూనియన్ రామచంద్రపురం స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారికి వినతిపత్రం అందచేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మాణం చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్ బలోపేతం చేయాలని, పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని, ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ప్రచారం నిర్వహించాలని, మెనూ నాణ్యత పెంచాలని, అంగన్‌వాడీకి స్టాకు సెంటర్ సమయాల్లో వేయాలని డిమాండ్లతో వినతిపత్రాలు అందచేశారు. ప్రాజెక్టు కార్యదర్శి ఎం.దుర్గమ్మ, నాయకులు చంద్రకళ, జి.వెంకటరత్నం, వి.సూర్యకుమారి పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

ద్రాక్షారామ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంబికపల్లి అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ద్రాక్షారామ బీమేశ్వర దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ క్రాంతికుమార్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా పేస్టులు పంపిణీ చేశారు. చిన్నారులకు నోటి శుభ్రత, పళ్లు తోముకునే విధానం గురించి వివరించారు.

అయ్యప్పస్వామి పడి పూజ

ఆలమూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చెముడులంకలో అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రాయుడు గోపాలకృష్ణ, పెదసత్యం అయ్యప్ప మాల ధరించిన సందర్భంగా పడిపూజ నిర్వహించారు. పువ్వులు, పండ్లతో అద్భుతంగా వేదికను ముస్తాబు చేసి అందులో వినాయకుడు, అయ్యప్పస్వామి, కుమారస్వామి చిత్రపటాలను ఏర్పాటు చేసి గారపాటి శివన్నారాయణస్వామి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప శరణఘోషతో ఆప్రాంతం మార్మోగింది. అనంతరం అయ్యప్ప భక్తిగీతాలు ఆలపించారు. పడిపూజను తిలకించడానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

కె.గంగవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భూసర్వే ద్వారా ఏర్పడిన సమస్యలు పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు అన్నారు. గురువారం కోటిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వేయర్ పావని మాట్లాడుతూ ఏఏ సమస్యలకు ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, ఆర్.ఐ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కపిలేశ్వరపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి (పీడీఎఫ్) అభ్యర్థి బొర్రా గోపిమూర్తి గురువారం అంగర, కపిలేవ్వరపురం, టేకి, మాచర, వాకతిప్ప పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు గురువారం గంగవరం ఉన్నత పాఠశాలకు వేరువేరుగా వచ్చి ప్రచారం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, తమకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో గంగవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇసుక పంపిణీ


మండపల్లి ఇసుకరీచ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న కపిలేశ్వరపురం తహశీల్దారు

కొత్తపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండపల్లి (ఆలమూరు-2) ఇసుక రీచ్‌లో అర్హులైన ఇళ్ల నిర్మాణదారులకు మాత్రమే ఇసుకను పంపిణీ చేయాలని కపిలేశ్వరపురం తహశీల్దారు పి.చిన్నారావు జట్టు కూలీలకు సూచించారు. గురువారం ర్యాంపులో ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన జట్టు కూలీలకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం స్టాక్‌పాయింట్లు వచ్చే వరకు సంబంధిత రీచ్‌ల్లో అవసరాల కోసం మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుక పంపిణీ చేపట్టేలా ఉండాలని కమర్షియల్‌గా ఏ ఒక్కరికి ఇసుక పంపిణీ చేపట్టరాదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనల మేరకు అవసరమైన వారికి ఇసుకను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడికి వచ్చే ప్రతి ట్రాక్టర్‌ను గృహ నిర్మాణదారులు అవసరం నిమిత్తం పంపిణీకి మాత్రమే ఈరీచ్‌లను ఉపయోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.చినబాబు, వీఆర్వో జి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ


గంగవరంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కె.గంగవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని డీపీఆర్‌సీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి వి.వి.ఎస్. లక్ష్మనరావు అన్నారు. గురువారం కె.గంగవరంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలు, ఏఏ నిధులు ఏవిధంగా ఖర్చు చేయాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ గౌరీ కుమారి, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం,(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, లైన్ డిపార్ట్‌మెంట్ సభ్యులు, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు, వ్యవసాయశాఖాధికారి, పంచాయతీ కార్యదర్శులకు గ్రామపంచాయతీ అభివృద్ధి చేయాల్సిన ప్రణాళికలను ఎంపీడీవో రత్నకుమారి, ఈవోపీఆర్డీ, మండల ట్రైనింగ్ అసిస్టెంట్లు శిక్షణలో వివరించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు, ఏపీఎం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, వాకతిప్ప, అం గర, అచ్యుతాపురం పశువైద్యాధికారులు, ఏవో వ్యవసాయ శాఖ, మండల కంప్యూటర్ ఆప రేటర్, పంచాయతీ కార్యదర్శులు, ఇన్‌చార్జ్ ఈవో పీఆర్డీ ఈశ్వరరావు, పరిపాలనాధికారి రాజేంద్రప్రసాద్, మండల రిసోర్స్‌పర్సన్ భీమేశ్వరి పాలొగన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండపేటశాఖా గ్రంథాలయంలో గురు వారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. నెహ్రూ చిత్ర పటానికి నిర్వాహకులు పూలమాలలు వేసిని వాళులర్పించారు. గ్రంథాలయాధికారి పూర్ణమ్మ, సుబ్బారావు పద్మజ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. తాపేశ్వరం శ్రీచైతన్యపాఠశాలలో గురువారం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ సారధ్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు సారధ్యంలో జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ఎనాయకులు కె.దుర్గారావు, ఎం.శ్రీను, సలీం, మణికంఠ, సత్తిబాబు, బాబి పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు

కపిలేశ్వరపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రందాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈవో కె.తాతారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయాలవారోత్సవాలను ఆయన ప్రారంభించారు. స్థానిక జెడ్‌పీహెచ్ఎస్ హెచ్‌ఎం వంగా శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో వివేకానంద స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ నాగేంద్రప్రసాద్, సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు చిట్టూరి సత్యనారాయణ, పాఠశాల విద్యార్థులు, గ్రంధాలయ పాఠకులు పాల్గొన్నారు.

పట్టాభి జన్మదిన వేడుకలు

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రైస్ మిల్లర్ల సంఘ మాజీ అధ్యక్షుడు, వైసీపీ నేత వేగుళ్ల పట్టాభి రామయ్య జన్మదిన వేడుకలను గురువారం ఆయన అభిమానులు, వైసీపీ కార్యకర్తలు మండపేటలో జరుపుకున్నారు. వైసీపీ నేత రెడ్డి రాధాకృష్ణ కార్యాలయంలో పట్టాబి అభిమానులు కేక్‌ను కట్‌చేసివేడుకలు నిర్వహించారు.

25నుంచి 108 సిబ్బంది సమ్మె

రావులపాలెం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఈనెల25నుంచి డిమాండ్లను పరిష్కరించాలంటూ 108సిబ్బంది సమ్మె చేస్తున్నట్లు అధికారులకు వినతిపత్రాలను అందచేశారు.రావులపాలెం 108సిబ్బంది వై.చిట్టిబాబు, జి.నాగరాజు, సీహెచ్ ప్రసన్నకుమార్, సీహెచ్ దేవంద్రబాబులు తహశీల్దారు బి.ముక్తేశ్వరావు, ఎంపీ డీవో మహేశ్వరరావులకు వినతిపత్రాలను అందచేశారు.

సమస్యలు పరిష్కరించండి

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని గురువారం 108 ఉద్యోగులు వినతిపత్రాన్ని అందించారు. ఆత్రేయపురం, ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందిస్తున్న 108సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈనెల25 నుంచి సమ్మెబాట పట్టనున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో రామన్‌కు 108 సిబ్బంది వినతిపత్రాలు అందించారు.

వినతిపత్రాలు అందజేత

కొత్తపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం 108ఉద్యోగులు ఎంపీడీవో, తహశీల్దార్లకు సమ్మె నోటీసులను అందించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. 108 ఉద్యోగులకు 8 గంటల పనివిధానాన్ని అమలు చేసి, ప్రభుత్వ నియమకాల్లో వెయిటేజీ కల్పించాలన్నారు.

గ్రామపంచాయతీ నిధులు సమర్థవంతంగా వినియోగించుకోవాలి

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ నిధులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో రమేష్‌రామన్ పేర్కొన్నారు. స్థానికమండల పరిషత్‌కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ శాఖల సిబ్బందితో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై శిక్షణ అందించారు. 2025-26 అభివృద్ధి- ప్రణాళిక సమర్థవంతంగా రూపొందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక శిక్షణ అందించారు. వివిధ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


చెల్లూరులో విద్యుత్ మీటర్లను తనిఖీ చేస్తున్న అధికారులు

విద్యుత్ మీటర్ల తనిఖీ

రాయవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో గురువారం విద్యుత్ మీటర్లను విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేశారు. డిప్యూటీ ఎడ్యుకెట్ ఇంజనీరు సీహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో 50 మంది సభ్యులు 14 బృందాలుగా విడిపోయి గ్రామంలో 351 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మూడు సర్వీసులపై కేసులు నమోదు చేసినట్లు ఏఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కేసులు నమోదు చేసిన వినియోగదారుల నుంచి రెండు లక్షలు పెనాల్టీ విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సబ్ ఇంజనీరు వి.ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యుటివ్ ఇంజనీరు కె.రత్నాలరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆలమూరు, కొత్తూరు, పెదపళ్ల, పినపళ్ల, సందిపూడి, చింతలూరు, సూర్యారావుపేట గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి, నవాబుపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు ఎస్‌వీ రమణ, రవికుమార్, వెంకటేశ్వర్లు, ఎస్.బేగం, ఎస్.సుజాత, కె.రవిబాబు విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం మండలం మెర్లపాలెం పాఠశాలలో బాలల దినోత్సవం


రాయవరం భాష్యం స్కూల్‌లో నెహ్రూకు నివాళి


కపిలేశ్వరపురంలో బాలల దినోత్సవంలో చిన్నారులు

నేటి బాలలు..రేపటి రత్నాలు

• ఉత్సాహంగా బాలల దినోత్సవం • జవహర్‌లాల్ నెహ్రూకు నివాళులు

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరిపారు. మహాత్మాగాంధీ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ పీఎస్ రాజు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. వాసంశెట్టివారిపాలెం పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, మ్యూజిక్ చైర్, రన్నింగ్ పోటీలు జరిపి విద్యార్థులకు బహుమతులు అందించారు.

రాయవరం: రాయవరం భాష్యం స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని జరిపారు. ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుతగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిల్లలను జాతి సంపదగా నెహ్రూ అభివర్ణించారన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ద్వారంపూడి చిన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: దేశానికి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం సత్యనారాయణపురం మండల ప్రజాపరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఆటల పోటీలు, ఏకపాత్రాభినయాలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వైకోటేశ్వరావు, ఉపాధ్యాయ సిబ్బంది వీరవేణి, ప్రమీల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో గ్రంథాలయాల వారోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం, ద్రాక్షారామ శాఖా గ్రంథాలయాల్లో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. రామచంద్రపురం శాఖా గ్రంథాలయ ప్రారంభోత్సవంలో పిల్లావారి వీధి మున్సిపల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీరామచంద్రమూర్తి గ్రంథాలయాల ప్రాముఖ్యత తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.ఈశ్వరుడు, ఎస్.ఆంజనేయులు, విద్యార్థులు, గ్రంథ పాలకులు డి.వెంకటరమణ, వనజాక్షి పాల్గొన్నారు.

ద్రాక్షారామలో: ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో జరిగిన ప్రారంభోత్సవంలో ప్రధానోపాధ్యాయుడు టి.సదాశివం మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అన్నారు. శాఖా గ్రంథాలయాధికారి ఎంవీ సూరిబాబు మాట్లాడతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలుగు ఉపాధ్యాయుడు వీరభద్రారెడ్డి తదితరులు మాట్లాడారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామన్ జ్యోతి ప్రజల్వన చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ పితామహుడు వెంకటరమణయ్య, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంఈవో వరప్రసాదరావు, ఉపాధ్యాయులు, గ్రంథాలయాధికారి తంబా నమఃశివాయ విద్యార్థులతో గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): పట్టణంలోని ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మోడరన్ అధినేత లయన్ జీవీ రావు, అకడమిక్ డైరెక్టరు ఎ.రమాదేవి మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో రామన్

బ్యాంకు లింకేజీ చేయించుకోవాలి

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) మండపేటలో బ్యాంకు ఖాతా కలిగినవారంతా ఎన్సీపీఐ లింకేజి చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.వీరంగారావు ప్రజలకు పిలుపు నిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ వార్డు వెల్ఫేర్ సిబ్బంది, కార్యదర్శులు, మెప్మా సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్లు నిర్మాణం

ఆలమూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సంధిపూడిలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.25లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతుంది. ఇటీవల మంజూరు చేసిన ఉపాధి నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను కూటమి నాయకులు దొడ్డా సుబ్బారావు, తోట వెంకటేశ్వర్లు, నల్లా వెంకన్న, తోరాటి ఆంజనేయులు తదితరులు పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



రాయవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక శివారు తుల్యభాగ వంతెన సమీపంలో ఉన్న శ్రీసాయిబాబా ఆలయ ఆరవ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అర్చకుడు పుల్లెటికుర్తి సూర్యనారాయణ అర్చకత్వంలో తొలుతగా సాయిబాబాకు వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం సాయిబాబాకు అర్చనలు హారతులు జరిపారు. వెదురుపాక, వి.సావరం, నదురుబాద, కొంకుదురు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులకు భారీ అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అరిబోలు రాంబాబు, మాన్యాల వెంకటేశ్వరరావు, వల్లు రామకృష్ణ, అరిబోలు నాగేశ్వరరావు, వెంకటరమణ, మీసాల చిన్న సోమన్న, సాయిరామ దీపిక, లలితాదేవి, అభిజిత్‌బాబు, సత్తి ప్రసన్నకుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా లంకమట్టి తరలిస్తే కఠిన చర్యలు

కె.గంగవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా బొండు ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసకుంటామని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు అన్నారు. గురువారం ఆయన కోట గ్రామపరిధిలోని లంక పొలాలను పరిశీలించారు. లంక పొలాల్లో బొండు ఇసుక తరలిపోతోందని వచ్చిన వదంతులపై పరిశీలనకు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎలాంటి తవ్వకాలు జరగలేదన్నారు. రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని, అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ద్రాక్షారామ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సిబ్బందికి శిక్షణ తరగతులు జరిపారు. ఈ శిక్షణ తరగతులలో జడ్పీ సీఈవో వీవీ లక్ష్మణరావు, డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.శాంతి పాల్గొన్నారు. రిసోర్సు పర్సన్‌లు వీ.ఎస్.సుబ్రహ్మణ్యం, సుందర్‌లాల్, పి.సత్యనారాయణ, ఎ.వెంకటేష్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.పద్మజ్యోతి, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.